www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
గురువారం
13 మార్చి 2025

## విలేఖరులు కావలెను



కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



## సామాజిక న్యాయం సంక్షేమానికి
# పెద్దపీట
### గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ

కలంజ్యోతి, హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అధికార, ప్రతిపక్ష పార్టీల హోరాహోరీతో ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ప్రసంగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆయన ప్రసంగం మధ్యలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలుపుతూ అసెంబ్లీలో ఆందోళన వ్యక్తం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ తన ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ, సామాజిక న్యాయం, సంక్షేమం పట్ల ప్రభుత్వ కట్టుబాటును హైలైట్ చేశారు. రైతుల సంక్షేమం కోసం రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం గేమ్ ఛేంజర్‌గా మారిందని గవర్నర్ తెలిపారు. వరి రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామని ప్రకటించారు. యువత ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గవర్నర్ ప్రసంగించేటప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హాజరు కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు.

## సమస్యను మనదిగా భావించినప్పుడే పరిష్కారం
### హైడ్రా కమిషనర్ రంగనాథ్



కలంజ్యోతి, హైదరాబాద్ : సమస్యను మనదిగా భావించినప్పుడే పరిష్కారం సులభమవుతుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి 'మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ)లో పౌర కేంద్రీకృత పాలనలో ప్రజావాణి, ప్రజాపాలన పాత్ర' అనే అంశంపై ఒక్కరోజు చర్చా కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్.. పలు అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా హైడ్రా ప్రజావాణి నిర్వహిస్తున్న తీరును, పరిష్కారం చేసిన అంశాలను, ప్రజలకు కలిగే మేలును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అనేక సమస్యలతో మన వద్దకు వస్తుంటారని, వాటిని పరిష్కరించడం మన బాధ్యతగా ప్రభుత్వ ఉద్యోగులు, మరీ ముఖ్యంగా అధికారులు భావించాలని అన్నారు. అలాగే ప్రజల సమస్యలన్నీ దాదాపు సంప్రదింపులతో.. సరైన సూచనలతో పరిష్కారం అవుతాయని, కేవలం 20 శాతం మాత్రమే జటిలంగా ఉంటాయని తెలిపారు. అందుకే ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేశారని, ఈ క్రమంలోనే ప్రజాపాలన, ప్రజావాణికి ప్రాధాన్యతనిచ్చారని చెప్పారు. స్టేట్ ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ డా. చిన్నారెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వెళ్తున్నారని, వారికి అభినందనలు తెలియజేశారు. అంతేగాక పరిపాలన విధానం ఎలా ఉంది.. సమస్యలపై కింది స్థాయి అధికారుల స్పందన.. ఇలా ప్రజల పల్స్ తెలుసుకోడానికి ప్రజావాణి ఎంతో ఉపయోగపడుతుందని, అందుకే ప్రజావాణిని హైడ్రా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని అన్నారు. ప్రతి సోమవారం ఓ ముఖ్యమైన కార్యక్రమంగా భావించి ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు.



## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

**కలంజ్యోతి, జగిత్యాల :** పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమిటీ నుండి పరిశీలకులుగా వచ్చిన ఏఎస్ఓసీ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి రాము ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఈ కార్యవర్గంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ (స్కౌట్స్)గా బియ్యాల హరి చరణ్ రావు, జిల్లా కార్యదర్శిగా కొలగని మధుసూదన్, సంయుక్త కార్యదర్శిగా వుజగిరి జమున రాణి కమీషనర్ (గైడ్స్) అజితా కమిషనర్ (కబ్స్) వినోద్ గౌడ్, కోశాధికారిగా నర్సయ్య ఆర్గనైజింగ్ కమిషనర్ (స్కౌట్స్)గా వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కమిషనర్ (గైడ్స్) పద్మజ ట్రైనింగ్ కమిషనర్ (స్కౌట్స్) నాగరాజు, ట్రైనింగ్ కమిషనర్ (గైడ్స్) సంగీతని ఎన్నుకొన్నారు. నూతనంగా ఎన్నికైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్గవర్గ సభ్యులకు జిల్లా విద్యాధికారి రాము, ఏఎస్ఓసీ వెంకటేశ్వర్లు అభినందనలు తెలియజేశారు. ఎన్నికైన కార్యవర్గం యొక్క పదవి కాలం 5 సంవత్సరాలు ఉంటుందని తెలియచేశారు. కార్యక్రమంలో జిల్లా లోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పని చేస్తున్న కబ్ మాస్టర్స్, స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్ పాల్గొన్నారు.



## సామాజిక సేవ అందరి బాధ్యత

### యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ రీజనల్ హెడ్ అరుణ సవిత

**కలంజ్యోతి, జగిత్యాల :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యతలో భాగంగా జగిత్యాలలోని వివిధ మహిళ, ఎస్సీ హాస్టళ్లకు 5 శుద్ధ జల తాగునీటి ఫిల్టర్స్ (వాటర్ డిస్పెన్సర్లు) అందజేశారు. కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి అరుణ సవిత హాజరై, వాటర్ డిస్పెన్సర్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని అధిగమించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి శ్రీ రాజ్ కుమార్, ఎల్‌డీఎం రాం కుమార్, యూబీఐ వివిధ శాఖల మేనేజర్లు, ఎఫ్ఎల్సీ కౌన్సిలర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# 27 వరకు అసెంబ్లీ సమావేశాలు

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం (మార్చి 12న) మొదలయ్యాయి. కాగా.. గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ప్రసంగం అనంతరం భేటీ అయిన బీఏసీ.. కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 27వ తేదీ వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది. కాగా.. 19న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు.. ఈ సమావేశాల్లో కీలక బిల్లులైన బీసీ రిజర్వేషన్, ఎస్సీ రిజర్వేషన్‌లపై చర్చ జరిపి ఆమోదం తెలపనున్నారు.

### తెలంగాణ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్

తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యాయి. ఈ అసెంబ్లీ సమావేశాలు మార్చి 27వ తేదీ వరకు కొనసాగించాలని బీఏసీ నిర్ణయించింది. బుధవారం న అసెంబ్లీ సమావేశాలు మొదలవగా.. గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం నిర్వహించారు. మంత్రులతో పాటు విపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నుంచి హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బీఏసీ నుంచి ఏలేటి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ప్రజాసమస్యలపై చర్చించేందుకు వీలైనన్ని ఎక్కువ రోజులు సభ నిర్వహించాలని విపక్షాలు కోరగా.. మార్చి 27వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు.

### 15 నుంచి 18 వరకు కులగణనపై చర్చ

14న హోలీ, 16న ఆదివారం, 20, 23న సెలవులు ఉండటంతో.. ఈ నాలుగు రోజులు మినహాయించి మొత్తంగా 12 రోజుల పాటు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. అయితే.. ఈ అసెంబ్లీ సమావేశాల్లో 15 నుంచి 18 వరకు కులగణనపై చర్చ జరగనుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును 15వ తేదీన ప్రవేశపెట్టబోతోంది. 17, 18వ తేదీల్లో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేకంగా చర్చించనున్నారు.



### 19న అసెంబ్లీలో బడ్జెట్..

మరోవైపు.. మార్చి 19వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సభలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. 20వ తేదీన సెలవు కావటంతో.. 21, 22వ తేదీల్లో బడ్జెట్ మీద చర్చించనున్నారు. 24, 25, 26వ తేదీల్లో పద్దులపై చర్చలు జరుపుతారు. చివరగా 27వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెట్టనున్నారు. అయితే.. సభలో కృష్ణా జలాల హక్కు, రైతుల ఆత్మహత్యలు, రుణమాఫీ, రైతుభరోసా, స్థానిక సంస్థల నిధుల లేమి వంటి ప్రధాన అంశాలపై కూడా అసెంబ్లీ చర్చ జరగనున్నట్టు తెలుస్తోంది.

ఇదిలా ఉంటే.. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపిన తర్వాత కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్‌లో ఆమోదం పొందేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. దీంతో.. ఈ సమావేశాలు సర్వత్రా ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి.

### కాంగ్రెస్ హయాంలోనే

## రోడ్లకు మహర్దశ

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

**కలంజ్యోతి, నర్సాపూర్ :** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం లచ్చిరెడ్డిగూడెం గ్రామానికి మంజూరైన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి హయాంలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకు నేడు మహర్దశ వస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. నిత్యం ప్రజలో ఉంటూ సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, పులిమామిడి నవీన్ గుప్తా, మాధవరెడ్డి, దొంతిరెడ్డి నరసింహారెడ్డి, లక్ష్మీకాంతం సుధీర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కమలాపూర్ సింగ్, సురేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, అక్బర్, వారాల గణేష్, వెంకటేష్, దుష్యంత్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, హనుమంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మాణిక్ రెడ్డి, వజ్రా శీను, ప్రభు, లింగంగౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, రాజు, అరుణ్, సోను, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

### ఎ.పురుషోత్తంనాయక్

**కలంజ్యోతి, మంచిర్యాల :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్ లో ఉచిత శిక్షణ అందించి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభి వృద్ధి అధికారి ఎ.పురుషోత్తం నాయక్, ఆదిలాబా ద్ బి.సి. స్టడీ సర్కిల్ సంచాలకులు ప్రవీణ్ కుమార్ లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. హైదరా బాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్, ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా ఒక నెల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ నిర్వహించడం జరుగు తుందని, శిక్షణ పూర్తి అయిన తరువాత ప్రైవేట్ బ్యాంక్ లో ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగు తుందని తెలిపారు. డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 నుండి ఏప్రిల్ 8వ తేదీ వరకు ఆన్ లైన్ లో www.tgbcstudycircle.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్/దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన అభ్యర్థులకు ఏప్రిల్ 12వ తేదీన ఆన్ లైన్ లో స్క్రీనింగ్ టెస్ట్ ఉమ్మడి జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో 1 లక్షా 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల రూపాయల లోపు ఉండాలని, ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్లో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 08732221280 నంబర్లో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి

### జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాల యంలో కలెక్టర్ తన ఛాంబర్ లో అన్ని మండ లాల ఎంపీఓ, మున్సిపల్ కమిషనర్ జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. అన్ని మండలాల వారీగా ఎల్ఆ ర్ఎస్ దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ పరిధిలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖా స్తులను ఒక్కో వార్డులో మూడు దరఖాస్తులను చొప్పున రుసుము చెల్లింపు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్క పంచాయతీలో ప్రతిరోజు 50 దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.



అనంతరం పదో తరగతి 202425 విద్యార్థులకు జిల్లా కలెక్టర్ వర్చ్యువల్ (జూమ్) సమావేశం ద్వారా విద్యార్థులతో దిశా నిర్దేశం చేశారు. 202425 విద్య సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులతో వర్చ్యువల్ (జూమ్) మీటింగ్లో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి భయాందోళన చెందకుండా పదవ తరగతి పరీక్షలను పూర్తి సన్నద్ధ తతో ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ పరీక్షలు రాయాలన్నారు. సమావేశంలో డీపీఓ మధన్ మోహన్, జిల్లా విద్యా అధికారి రాము, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గవర్నర్ ప్రసంగం

# అబద్ధాల పుట్ట




**కలంజ్యోతి, గీసుగొండ :** తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం పూర్తిగా అబద్ధాల పుట్టగా కేటీఆర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైనాల నరేష్ విమర్శించారు. ప్రభుత్వ ఒత్తిడిలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా సత్యదూరపు మాటలతో ప్రసంగం కొనసాగించారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయని ప్రభుత్వం, అసెంబ్లీ సాక్షిగా అసత్య ప్రకటనలు చేయడం దారుణమని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు పంటలు తగులబెట్టే ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నా.. గవర్నర్ ప్రసంగంలో వీటిపై ఒక్కమాట కూడా ప్రస్తావించలేదన్నారు. 14 నెలలుగా అన్నివర్గాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గవర్నర్ ప్రసంగంలో మాత్రం పాలన అద్భుతంగా ఉందని భజన చేయడం అవమానకరమన్నారు. ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని త్వరలోనే ప్రజలు బహిష్కరించేందుకు సిద్ధమవుతున్నారన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల పొలంబాట

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని ముత్తారం గ్రామంలో విద్యు త్ ఉద్యోగులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ రూరల్ డివిజన్ కొత్తకొండ సెక్షన్ లో గల ముత్తారంలో పంట పొలాలను సందర్శించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా డివిజనల్ ఇంజనీర్ సామ్యా నాయక్ మాట్లాడుతూ, రైతులకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా తమ సిబ్బంది పనిచేస్తుందని అన్నారు. ముఖ్యంగా విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు పెట్టుకోవాలని, అలాగే ఆటో స్టార్టర్లు తొలగించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కెపాసిటర్లు అమర్చడం వల్ల విద్యుత్ మోటర్లు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని, లో వోల్టేజ్ సమస్య లేకుండా పనిచేస్తాయని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వంగిన విద్యుత్ పోల్స్ ను సరి చేయడం, విద్యుత్తు లైనులను స్టీరింగ్ చేయడం, విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి ఏడిఈ రాజేశ్వరరావు, ఏఈ శిరీష్ కుమార్, సబ్ ఇంజనీర్ సుదర్శన్, లైన్ ఇన్స్పెక్టర్లు సంపత్, దాసు, సిబ్బంది వెంకటరెడ్డి, రామకృష్ణ, అరవింద్, సంతోష్, దినేష్, రాజు కుమార్, నవీన్, సాంబయ్య, రాజిరెడ్డి రైతులు పాల్గొన్నారు.





## నల్లపోచమ్మతల్లి జాతర పోస్టర్ ఆవిష్కరణ

**కలంజ్యోతి, నర్సాపూర్ :** నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండల పరిధిలో షేర్ ఖాన్ పల్లి గ్రామ శివారులో గల పలుగుమీద నల్ల పోచమ్మ తల్లి జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశం తెలిపారు. ఈ సందర్భంగా జాతర బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు ఆవిష్కరించారు. ఈనెల 23న ఎల్లమ్మ దేవి కళ్యాణం, 24న అగ్గిగుండాలు, బోనాలు, 25న బండ్లు ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.




## ఆర్బీఐ డిజిటల్ పేమెంట్స్ పై అవగాహన సదస్సు

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్బీఐ డిజిటల్ పేమెంట్స్ పై తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఇల్లంతకుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎం.రమేష్ యాదవ్ మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపుల ద్వారా బ్యాంకింగ్ సౌకర్యాలను ప్రజలు చాలా సులభంగా, వేగంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల సమయంలో మోసపోకుండా ఉండడానికి సైబర్ సెక్యూరిటీ గురించి విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు.



## గౌడ సంఘం ఆధ్వర్యంలో యువకుడికి సన్మానం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన గొట్టిపర్తి రాకేష్ గౌడ్ గ్రూప్ -2 ఫలితాలలో 24వ ర్యాంకు పొందిన నేపథ్యంలో మండల కేంద్రంలోని గౌడ సంఘం సభ్యులు రాకేష్ సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట గౌడ సంఘ అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య, ఉపాధ్యక్షుడు అంతటి రమేష్, మాజీ ఎంపీటీసీ కొయ్యడ భాస్కర్, సంఘం కోశాధికారి ముంజ భాస్కర్, ప్రధాన కార్యదర్శి బండారి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు బండారి సత్తయ్య, సభ్యులు కొయ్యడ లింగయ్య, ముంజ భూపతి, బండారి రాజు, సుధ గోని నాగేంద్ర, అంతటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## అన్నిరంగాల్లో ముందుండాలి

### మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లత

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** మహిళా దినోత్సవం పురస్కరించుకొని సూరారం విశ్వకర్మ కాలనీలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లత, కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని పిలుపునిచ్చారు. మహిళలేనిది సృష్టి లేదని ప్రతి మహిళ తన ఇంటికి వెలుగునిచ్చే గొప్ప దైవము లాంటిదని అన్నారు. అనంతరం విశ్వకర్మ కాలనీకి చెందిన 25 సంవత్సరాల వ్యక్తికి వీల్ చైర్ బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రెటరీ సదానందం, వాసు, బి మల్లేష్, కే లత, మానస, సరిత, నిర్మల, సౌజన్య, సుధా, తదితరులు పాల్గొన్నారు.





## బావిలో పడి యువరైతు మృతి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన తోగరు విజయ్ పాల్ రెడ్డి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. రోజువారీగా బుధవారం ఉదయం వాకింగ్ చేసుకుంటూ తన వ్యవసాయ బావి వద్ద మొక్కజొన్న వరి పంటలకు మీరు పెట్టే క్రమంలో మోటర్లు ఆన్ చేసి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడినట్లు రైతులు తెలిపారు.




## ఫిష్ ఫుడ్ కోర్ట్ ప్రారంభం

**కలంజ్యోతి, మంచిర్యాల :** ఇందారం మహిళ మత్స్యకారుల సహకార సంఘం సభ్యులు ఆర్థిక అభివృద్ధికి కొత్త వ్యాపారాల వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఫిష్ ఫుడ్ కోర్ట్ ను ప్రారంభించారు. ప్రకృతి పర్యావరణ సంస్థ సౌజన్యం తో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో చేపల ఆహార పదార్థాల విక్రయ కేంద్రాన్ని ప్రకృతి పర్యావరణ సంస్థ నిర్వహణలో ఎస్ఎఫ్ఏసీ మంజూరు చేసిన నిధులతో ఏర్పాటు చేసిన ఆ కేంద్రాన్ని మంచిర్యాల జిల్లా మత్స్యకార కార్యాలయం ఇన్ స్పెక్టర్ రాందాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ క్షేత్రస్థాయి అధికారి బావ్యశ్రీ, ప్రకృతి పర్యావరణ సంస్థ ప్రాజెక్టు ఇంఛార్జి కిరణ్ కుమార్, క్షేత్రస్థాయి అధికారి శివ కుమార్, ఇందారం మత్స్యకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలి

### గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరన్



**కలంజ్యోతి, జగిత్యాల :** మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్లి విజయాలు సాధించి ఆదర్శంగా నిలవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువీరన్ అన్నారు. జగిత్యాల మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయంలో మహిళ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. మహిళ సంఘాలకు ఇందిరా మహిళశక్తి కార్యక్రమం కింద ఆర్టీసీ బస్సులు, షోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, లోను బీమా, పలు ఎంటర్ ప్రెన్యూర్ యూనిట్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులుగా, ఏకారుప దుస్తుల తయారీ, కొనుగోలు కేంద్రాలు, వడ్డీలేని రుణాలు ఇంకా పలు పథకాలు అమలు చేస్తూ మహిళలు ఆర్థికంగా అభి వృద్ధి చెందేలా చేయడం జరుగుతుందని, ఇటువంటి ప్రోత్సాహకాలు అందుకొని మహిళలు మంచి మంచి విజయాలు సాధించి ఆదర్శంగా నిలవాలని అన్నారు. అంతకు ముందు రూరల్, అర్బన్ మండలాల అన్నపూర్ణ, అక్షర మండల సమాఖ్యల సర్వస్వాభ్య సమావేశం నిర్వహించి నూతన పాలక వర్గ సభ్యులను గ్రామ సమాఖ్య సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ చరణ్ దాస్, డీపీఎం మానిక్ రెడ్డి, మండల ఏపీఎం వి.గంగాధర్, డీఎంజీ దేవయ్య, సీసీలు పి. గంగారాం, రవీందర్, మరియా, విధ్యాసాగర్, సిబ్బంది పద్మ, రెండు మండలాల్లోని అన్ని గ్రామాల గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లు హాజరయ్యారు.



## విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి

### ఏబీవీపీ నర్సంపేట నగర కార్యదర్శి రాకేష్

**కలంజ్యోతి, నర్సంపేట :** రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ నర్సంపేట నగర కార్యదర్శి రాకేష్ డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సంద్భంగా రాకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు విద్యార్థులను, ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దాన్నుకున్నారు. కానీ గెలిచాక ఆరు గ్యారంటీలు పక్కనపెట్టి పనికిమాలిన రాజకీయాలు చేస్తుందని మండి పడ్డారు. అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించకపోతే క్యాంప్ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జయముఖి కళశాల ప్రెసిడెంట్ ప్రణయ్, సాయి, అభిరామ్, అనదీప్ తదితరులు పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే కోటాలో విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి మంగాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పబ్బతి కృష్ణగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక బీసీ మహిళ అయినటువంటి విజయశాంతిని గుర్తించి ఎమ్మెల్యే కోటలో ఎమ్మెల్సీగా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# హాట్ స్టిల్స్‌తో రచ్చ

టాలీవుడ్ హీరోయిన్ ప్రణీత శుభాష్ గురించి స్పెషల్‌గా చెప్పనక్కర్లేదు. స్టార్ హీరో సిద్దూ సరసన 'బావ' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. అలాగే తన నటనతో మంచి ఫేమ్ తెచ్చుకుంది. దీంతో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అయితే వచ్చిన అవకాశాలన్నింటిలో నటించి మెప్పించినప్పటికీ అనుకున్నంత స్టార్ డమ్ అయితే రాలేదు. దీంతో సినిమాల్లో సెకెండ్ హీరోయిన్‌గా నటించసాగింది.

తాజాగా ప్రణీత శుభాష్ తన ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది. అందులో గ్రే కలర్ ప్యాంట్, షూట్ వేసుకుని ఫొటోస్‌కి స్టిల్స్ ఇచ్చింది. అలాగే లోపల ఉన్న బ్లాక్ కలర్ బ్రా కనిపించేటట్టు.. అంతేకాకుండా చెస్ట్ పార్ట్ కూడా కనిపించేలా హాట్ షో చేసింది. దీంతో ఈ పిక్స్ కాస్తా నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు అసలు పెళ్లై ఇద్దరు పిల్లలున్న ఇంత గ్లామర్‌ను ఎలా మెయింటెన్ చేస్తున్నావ్.. గ్లామర్ విషయంలో నీ యవ్వ తగ్గేదేలే అంటున్నావుగా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ భామ పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే తన ప్రియుడితో పెళ్లి పీటలెక్కింది. ఇక వీరి ప్రేమకు గుర్తుగా ఈ జంటకి ఒక పాప పుట్టింది. మళ్లీ రీసెంట్‌గా ఒక బాబు కూడా జన్మనిచ్చింది. ఇక ఫ్యామిలీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటుంది ఈ బ్యూటీ.

